



"ఫైన్ ఆర్ట్స్ కార్యదర్శిగా ఎన్నుకోబడ్డారట కదూ! కంగ్రాచ్యులేషన్స్ మిస్టర్ సుబ్బ..!"

రావ్ ! ఒకే క్లాసులో కలుస్తున్నా పేరు సరిగ గుర్తుకు రాలేదులా ఉంది సారీయండి. అదృష్టవంతుణ్ణి "

"సారీ సుబ్బరావ్ ... ",

"దానికేంలెండి" శేషావతారంకేసి చూస్తున్న కళ్యాణిని ఓరగా చూస్తూ అన్నాడు సుబ్బరావ్.

"మీ హయాంలో ఫైన్ ఆర్ట్స్ ఎంత బాగుపడుతుందో చూడాలని కోరికగా ఉంది "

"మీ సహాయం ఉంటే తప్పక ప్రోగ్రెస్ అవుతుంది "

ఇంతలో 'కళ్యాణీ' అంటూ హేమ వచ్చింది. కళ్యాణి హేమని సుబ్బరావ్‌కి పరిచయం చేసింది. పరస్పర అభివందన లయ్యాక హేమ అంది సభ్యత ఉట్టిపడేలా.

"సుబ్బరావ్‌గారూ ! కళ్యాణి లేడీస్ సెక్రటరీషిప్‌కి పోటీ చేస్తోందండీ. మీ కోపరేషన్ కావాలి" అంది


"అంతకంటేనా ... "

"ఆయనకి మనం అంతలా చెప్పనక్కర్లేదే ! ఆయనే హెల్పు చేస్తారు" అని కళ్యాణి హేమతో వెళ్లిపోయింది.

ప్రక్కనే ఉన్న నరసింహం, శేషావతారం వగైరాలు గుడ్లప్పగించి చూస్తూ ఉండిపోయారు.

కొంతసేపటికి నరసింహం తేరుకొని "ఈ

(58-వ పేజీ చూడుడు)



తెలుగు పత్రికలన్నింటిలోనూ 'ఆంధ్ర సచిత్రవారపత్రిక' సర్క్యులేషన్ అత్యధికమైనది.

# తరచుగా మూత్రవిసర్జన

చక్కెరతో గాని, చక్కెర లేకుండా గాని తరచుగా మూత్రము వెలువడుట మిక్కిలి ప్రమాదకరమైన చిహ్నము. శరీరాన్ని శుష్క చేయడమే కాకుండా ఈవ్యాధి, తనబంధంలో చిక్కినవారిని ఆగోజు కాగోజు మృత్యువుకు ఆసన్నుని చేయును. ప్రథమదశలో శారీరక మానసిక శ్రమలకు యిచ్చగించకుండుట, నడుములో నొప్పి, చూపుమాంద్యము, తొడల్లో తిమ్మిరి, నరముల బలహీనతతో యీ వ్యాధి పొడచూపును. పై లక్షణములతో కూడిన వ్యాధికి వెంటనే తగిన చికిత్స చేయించకున్నచో, అధికదాహం, ఆకలి, గొంతు నోరు ఎండుట, గురదలు, కాళ్ళలో పగుళ్ళు, తూకం తగ్గడం, శరీరమంతా పోట్లు, కీళ్ళ నొప్పులు, కంటిపొరలు, క్షయ, గడ్డలు, రాచ పుండ్లు, ఇట్టి భయంకర బాధాకరమైన వ్యాధులు యెన్నో సంభవింపవచ్చును.

"వీనస్ ఛారమ్" మాత్రలు వాడి అనేక వేల మంది తమబాధలనుండినివారణపొంది మృత్యుకరాళమునుండి రక్షింపబడిరి. "వీనస్ ఛారమ్" శాస్త్రీయ పద్ధతులమీద ప్రాచీన యూనాని వైద్యవిధానం ప్రకారం అమూల్య ఓషధుల శాకపదార్థముల, స్వాభావిక క్షారముల సారముతో తయారైనవి. "అమిత దాహము, మూత్రంలో చక్కెర తగ్గి పలుమారు మూత్ర విసర్జనచేయు అవసరము 2 రోజులలోనే లేక 3 మీకు చాలాభాగము నివారణయగును. కొద్ది రోజులలోనే మీకు సగానికిపైగా స్వస్థత చేకూరిన ట్లనిపించును. "వీనస్ ఛారమ్" కొద్ది వ్యయముతో సుఖముగా, తేలికగా సేవించవచ్చును. దీనికి ప్రత్యేకపథ్యము లేదు. నిరాహారముతో నుండే అవసరంలేదు. రోగులు పుష్టికరమైన ఆహారము తినేందుకై ఇదివరకటి కంటే ఎక్కువ రకాల ఆహారపదార్థములు తీసికొనవచ్చును. వివరములుగల ఇంగ్లీషుకరపత్రములు అడిగినవారికిఉచితముగా పంపబడును. **50** బిళ్ళలఖరీదు రు.**6-75**న.పై. మాత్రమే. పోస్టేజినిమిత్తం రు. **1-6** న.పై. అదనం. (ఒకేసారి రెండు, అంతకుపైగా సీసాలను తీసికొన్నచో పోస్టేజి ఉచితం.)

(SELLING AGENTS)
**Barrys Commercial Corporation**
(A. P. W)
27/A, Dhurumtollah Street
CALCUTTA-13.

# ప్రేమసితారా

(9-వ పేజీ తరువాయి)

జగదేక కాలినా ప్రేమిస్తున్నా నన్నావు ప్రతికి బట్టకట్టినట్లే అయితే"

"పద ఇక ! అంతలా ఛీ కొట్టాక ఇంకా ఎందుకు ఇక్కడ సిగ్గు లేకుండ .... " శేషావతారం సగంలో ఆపేశాడు.

"ఎవడైనా చూస్తే గుట్టు అంచనా వేస్తాడు పద .... పద .... "

అంతా బయల్దేరారు చెట్లక్రిందకి.

ప్రేమించిన పడతి నూటి పోటి మాటలు, మిత్రుల విమర్శలమధ్య తికమక లాడుతున్నాడు సుబ్బరావ్‌!

ఎవరూ మాట్లాడలేదు. సభాసదు లంతా ఆశీను లయ్యాక శేషావతారం నిశ్శబ్దాన్ని భంగంచేస్తూ అన్నాడు.

"హవ్వ .. . యుగాలుగా వస్తున్న పురుషజాతి ఆత్మగౌరవానికి ఎంత ఉప్పెన తీసుకువచ్చింది...."

"హుష్" సుబ్బరావ్ మందలించాడు.

"ఏమిట్రా కాకుల మనుకున్నావా ?" శేషావతారానికి కోపం పొంగింది. పొయ్యిమీద పాలకీలాగ.

"అలాగ అనుకున్నా బెంగలేదు వీణ్ణి నమ్ముకుని వెళ్ళినందుకు అమ్మాయిల దగ్గర కోతుల మయ్యాము." నరసింహం వలవల ఏడ్చినంత పని చేశాడు.

"మరే ఒక నాతిముందలి కోతులం .... "

"ఆ వ్రూబోణి కళ్యాణిని అవమానించి తీరాలి" అన్నాడు నరసింహం అవధులు మించని ఆగ్రహంలో.

"నేను ప్రేమించానురా .... " — సుబ్బరావ్ అప్పీలు చేసుకొన్నాడు.

"ఛీ ! ఛీ ! ఆ చేగోణిని ప్రేమించావట. సిగ్గు లేకపోతే సరి చెప్పుకోటానికయినా."

"పోనీ అది నిన్ను ప్రేమించొద్దూ !"

సుబ్బరావ్‌కి శేషావతారం మాటలేమీ వినపడ లేదు. అతని లోకం మరో లోకం.

"కళ్యాణి నన్ను ప్రేమిస్తోందిరా !"

"తెలుస్తోందిలే !"

సుబ్బరావ్ చేతులు రెండూ పైకెత్తి 'శేషూ! నీకంత వేళకోళంగా ఉందేమో కళ్యాణి నేను క్రమంగా శ్రీమతీ, శ్రీ లు అయిపోతే నవ్వి పోతారు మీరంతా" అన్నాడు.

శేషావతారం సీరియస్‌గా సుబ్బరావ్ నుదుటి మీద చెయ్యివేసి "ఏరా ! నాన్నా ! విశాఖపట్నానికి టికెట్టు కొననా ?"

"కొనుక్కోండి తీసుకెళ్తాను."

"ఒరేయ్ ! సుబ్బా ! నీకు మతిపోలేదుకదా!"

* *

సుబ్బరావ్ రోమియో అవతారం అని హాస్టలంతా మారుమ్రోగిపోయింది. కళ్యాణివంటి జడ్జిగారి అమ్మాయి, వ్రతం పడితేనేగాని లభ్యం కాదాని దురాశాభావం వ్యక్తం చేశారు లాబీ వర్గాలవారు. కాఫీ అర్ధాల బలగాన్ని, టిఫినర్థుల బలగాన్ని ఎంత తగ్గించుకొన్నా, సుబ్బరావ్ లాటి ప్రేమపిపాసికి సలహాలు అందుతూనే ఉన్నాయి. కొందరు కార్యార్థులు సుబ్బారావ్‌ని బుట్టలోవేసుకొనే ఉన్నారు ఒక పెద్ద కవి యుగంలోనే సినిమా మార్నింగ్‌షో చూసినంత ఆనందం పొందాడనీ, వరలోక కవి క్షారసముద్రంలో మసాలాదోసె తిన్నాడనీ చెప్పి, విసుగులోనూ, విరహంలోనూ ప్రేమాంచలాన్ని పట్టుకోమన్నారు సుబ్బరావ్‌ని.

ఇదీ ఓ 'పాయింట్' క్రిందే కన్పించింది అతనికి. అంతా కళ్యాణిని ఏడిపించి, విసిగించి తద్వారా, సత్వరప్రేమఫలాన్ని సుబ్బరావ్‌కి అందజేయా లని నిశ్చయించారు. సుబ్బరావ్ ఆమోదించాడు. నాయకత్వం వహించాడు. ఒక ప్రణాళిక ముసాయిదా సృష్టించారు. దాని ప్రకారం సెక్రటరీ సుబ్బరావ్ బహుబెట్టుగా మసలాలి. సుబ్బరావ్‌కి కథలు వ్రాయటం, హిమాలయా లెక్కటం వంటి పని కాబట్టే టెన్సింగ్‌లాంటి నరసింహం చేత వ్రాయించి కళ్యాణి పేరు పెట్టి పత్రికలకి పంపించటం, తననిగురించి చాల చెడుగా కథలో తన పేరుమీద తన పాత్ర సృష్టించిందని ప్రిన్సిపాల్‌గారితో చెప్పి అపాలజీ పొందటం ఆంధ్ర వారోత్సవాలలో ఆమెని స్టేజి ఎక్కించి ఆమెకి రాని కార్యక్రమాన్ని ఏర్పరచి రసాభాస చేయటం ఎట్‌సెట్రా ........

ఈ చిత్తు కాపీ తయారుచేసేటప్పటికి సుబ్బరావ్ సగందూరం జయించినంత సంబరపడ్డాడు. అతని సూత్రావళి మొదటి లైను— "నాల్గు మూడు పరిచయాలు ఆధునిక యువప్రేమికులలో ప్రేమ బీజారోపణ చేస్తాయని "

* * *

"మీరు నాకు ముందుగా తెలియపరచాల్సింది. ఇప్పుడు వచ్చి చెప్తే ఎట్లా. అంతా కాలేజీనుండి వెళ్లిపోయారు. అయిదున్నర అయిపోయింది. నోటీస్సైనా తగిలించలేదు "లేడీస్ సెక్రటరీ కల్యాణీ ఘాటుగా సుబ్బరావ్‌తో అంటుంటే ప్రక్కనే ఉన్న శేషావతారం అడ్డువచ్చి "నోటీస్ తగిలించవలసింది సెక్రటరీ కాదు. సార్జంటు .... " అన్నాడు.

"జవాబు చెప్పవలసింది మీరు కాదు ఆయన" కోపగుంభితకా పిడికిలి బిగించి అంది కళ్యాణి.

శేషావతారానికి మరోమాట అందలేదు.

సుబ్బరావ్ ధైర్యంగా "మీతోటైనా చెప్తాను వస్తే రండి, లేకపోతే లేదు. ఒకరిద్దరి కోసం ఈ 'యూత్ ఫెస్టివల్ సెలక్షన్' ఆగిపోదు కావలిస్తే ఇలా అన్నానని ప్రిన్సిపాల్ గారితో — చెప్పండి. లేదా వైస్ ప్రెసిడెంట్‌తో రిపోర్టు చేయండి. నోటీ సందకపోతే బాధ్యత నాదికాదు" అని మెట్లుదిగి వెళ్ళిపోయాడు శేషావతారంతో.

"అబ్బ ! ఎంతపొగరూ .. " కళ్యాణి ప్రక్కనే ఉన్న హేమకి కోపం ఆగక కళ్యాణితో అంది

"సమయం రానీ, చెబ్దాం !"

ప్రిన్సిపాల్‌తో మాట్లాడి హేమతో రూమ్‌కి వెళ్ళిపోయింది కళ్యాణి ఎంత చూసినా ప్రిన్సిపాల్ గారు రాకపోవటంతో ఆయన గదికి వెళ్లాడు సుబ్బరావ్.

సుబ్బరావ్‌ని చూసి అన్నారు ఆయన. 'వాట్ సుబ్బరావ్ ! అమ్మాయి లెవరికీ తెలియదట' సెలక్షన్ ఉన్నట్లు. వాళ్ళు నోటీ సందలేదంటున్నారు. రేపటికి మార్పుచేయి సెలక్షన్ "

"నోటీ సందనట్లు నాకు తెలియదండి. సరే ! ఇవాళ్టికి ప్రోగ్రామ్ కాన్సిల్ చేయిస్తానండి"

అన్నాడు సుబ్బరావ్ లోపల లావాలా మసులుతున్న కోపాన్ని దిగమింగుతూ.

* * *

"మిస్టర్ సుబ్బరావ్! పాఠం వినాలని లేకపోతే బయటకి వెళ్లిపో. కిటికీగుండా యేటో చూస్తున్న సుబ్బరావ్‌ని మందలించారు ఫిజిక్స్ లెక్చరర్.

సుబ్బరావ్ జవాబు చెప్పలేదు. మాటాడకుండా బయటకి వెళ్లిపోయాడు. నిరసన సూచకంగా శేషావతారం కూడా సుబ్బరావ్ వెంట నడిచాడు.

"ఎందుకొస్తారో తెలియదు. ఇలాటివాళ్ళు కాలేజీకి" అని లెక్చరర్ పాఠం చెప్పటంలో లీనమవుదా మనుకొన్నాడు.

"షికార్లు కొట్టటానికి" — లేడీ స్టూడెంట్సు వైపునుంచి వచ్చిన మాట అది. అంతా కళ్యాణి కేసి చూసి కిలకిలమన్నారు.

"అలాగే ఉంది" అన్నారు లెక్చరర్ నవ్వుతూ.

చిలవలు పలవలు అల్లి ఈ సంఘటన రిపోర్ట్సు సుబ్బరావ్‌కి అందింది. ఏడుపు వచ్చినంత పని అయింది అతనికి. పైకి మాత్రం డాబుగా

"ఓస్ ఇంతేనా! దీనికి వెయ్యిరెట్లు పరాభవం మనం చేదాం" అన్నాడు.

"ఆ నిన్న ప్రోగ్రామ్ వాళ్ళు లేకుండా జరిపించలేకపోయావ్ గాని ఇప్పుడు ఇంకోటేదో వెలగబెడ్తాడట. నువ్వు ఉన్నావ్ సెక్రటరీవి. కళ్యాణి చూడు ఎలా కాన్సిల్ చేయించిందో. నువ్వు నడపాలి చేయాల్సిన ప్రోగ్రామ్‌ని.

"కంగారుపడకురా సింహాన్నా! రేపు చూస్తావుగా నా తడాఖా!"

"ఏమో! నాకేమీ నమ్మకంలేదు" నరసింహం నిస్పృహయత వెలిబుచ్చిన నిశ్వసనం అది.

"ఒరేయ్ .... శకునపక్షీ"—శేషావతారం నరసింహంమీద యుద్ధానికి వెళ్లాడు.

"ఏరా తైర్‌కుక్షీ"

"ఏమిట్రా పేలావ్!"

"ముందలి నోర్మూయించండి అవతారం గారూ?"

"ఉష్ ఉండండ్రా! రేపు కళ్యాణిని ఎట్లా చిన్నబుచ్చాలో ఆలోచించరేం? ఎప్పుడు చూసినా కుమ్ములాడుకోటానికి చూస్తారేం? ఒరేయ్! నరసింహం! కళ్యాణికి డాన్సు చేయటం వచ్చా."

"ఏమో నాకేం తెలుసూ? ప్రేమించినవాడివీ, పెళ్లి చేసుకొనే ప్రమాణం చేసినవాడివీ నీకే తెలియందే? ...." అన్నాడు నరసింహం.

"బాబూ సింహాన్నా!"

"ఆ అమ్మాయి పర్సనల్ సెక్రటరీ ననుకున్నావా?"

"నరసింహం! నాకు కోపం తెప్పిస్తున్నావ్?"

"లేదు గురూ! సారీ .... ఆ ఎన్. సి. సి. నడకకత్తెకీ, నాట్యానికీనా, .... భలేవాడివే. గార్దభకంఠి ఆ కళ్యాణికి 'తళాంగు ధక ధకతోం' కూడా రావాలీ..."

"చంపకురా. ఇంతకీ ఆమెకి డ్యాన్సు వచ్చా? రాదా?"

"రా .... దు."

"అలా చెప్పు" అని సుబ్బరావ్ సంతృప్తి చెందాడు.

క్రొత్తగా చేరినవాళ్లకి స్వాగతంచెబ్తూ సీనియర్ విద్యార్థుల ప్రసంగాలు క్రొత్తవాళ్ల ప్రతి జవాబులూ, అయిన తర్వాత రెండు మూడు 'బృంద గానాలు' అయ్యాక సుబ్బరావ్ మైక్ వద్దకు వచ్చి.

"ప్రచురించిన కార్యక్రమానికి ముందుగా ఒక ప్రత్యేకకార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నాం. కుమారి వి. కళ్యాణి సెకండ్. బి. యస్. సి. నృత్యం చేస్తారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ముందుగా ఆవిడకైనా తెలియపరచలేకపోయినందుకు చింతిస్తున్నాం. తగిన హంగులు లేకపోయినా ప్రేక్షకులు మంగోకలా భావించరనుకొంటాము. కుమారి కళ్యాణి సెకండ్ బి. యస్. సి' అని సుబ్బరావ్ కళ్యాణిని ఆహ్వానిస్తున్నట్లు ఆ లేడీస్ వైపు చూశాడు.

ఒకగుమాస్తా ఒక గంట ఆలస్యంగా ఆఫీసుకు వచ్చాడు. అతని తలకు కట్టుఉంది. దుస్తులు అక్కడక్కడా తడిసి ఉన్నాయి.

"ఏం ఇంత ఆలస్యం" అని అడిగాడు మేనేజరు.

"మేడమీదనుంచి కిందకు పడిపోయానండి" అన్నాడు. గుమాస్తా బిక్కుబిక్కుమంటూ "దానికి గంట టైమ్ పట్టిందా" అన్నాడు మేనేజర్ కోపంగా.

వి. సావయ్యశర్మ (బందరు)

కాని కళ్యాణి స్టేజికి వెనకాల ఉన్న గ్రీన్ రూమ్‌లోంచి నాట్యదుస్తులలో అలంకరించుకొని అప్సరసలా స్టేజీమీద అవతరించింది. ప్రేక్షకుల హర్షధ్వానాల ఉక్కిరిబిక్కిరిలో తననే మరచి నాట్యం చేయసాగింది. మణిపురి, కథాకళి నృత్యరీతులు రెండిటిని మచ్చుతునకలుగా ప్రదర్శించింది. శివతాండవనృత్యభంగిమల్ని కూచిపూడి విధానంలో చూపించి అందరి మన్ననల్ని అందుకుంది. షుమారు అరగంటసేపు ప్రదర్శన యిచ్చి అందరిచేత సెభాష్ అనిపించుకొంది.

నృత్యం అయ్యాక ఆమె మామూలు దుస్తులతో స్టేజిమీదకు వచ్చింది.

"ముందు నేను నృత్యం చేస్తానని తెలియపరచలేక పోయినా కొన్ని గంటల క్రితం అడిగిన వెంటనే అంగీకరించిన ఫైన్ ఆర్ట్స్ వైస్ ప్రెసిడెంటు గారికి, తెలిసో, తెలియకో అప్పటికప్పుడు ప్రకటించిన సెక్రటరీకి, మీకు కృతజ్ఞతాల్ని" అని ఒక్క గుక్కలో కృతజ్ఞత వ్యక్తం చేసింది కళ్యాణి.

దూరంగా ఇందాకటినుంచి నృత్యాన్ని తిలకిస్తున్న సుబ్బరావ్ మిత్రబృందానికి తెలివి తప్పబోయి ఎందుకులే అని వూరుకుంది. నరసింహం ఆ దరిదాపుల్లో మళ్లీ కన్పించలేదు. కళ్యాణి నృత్యవిశారద అని ఎవరూ అనుకోలేదు. వేసిన ప్లానంతా కుక్కలు ఈడ్చిన విస్తరి అయింది. ఇప్పటికి సుబ్బరావ్ రెండుసార్లు పేడి మార్కు మొహం వేయాల్సి వచ్చింది. కళ్యాణితో వీడు నెగ్గగలడా అని అణుమాత్రపు అనుమానం వేసింది శేషావతారానికి.

గ్రీన్‌రూమ్‌లో సుబ్బరావ్ కళ్యాణిని అభినందిస్తూ "కంగ్రాచ్యులేషన్స్ కంటే థాంక్సు ముందిటే చెప్పనీయండి. నేను ఎనౌన్స్ చేసేముందర నరసింహం చెప్పాడు మీరు నృత్యం చాలా బాగా చేస్తారని. అంతే. వెంటనే ఆహ్వానించాను. చూసి ఆనందిద్దామని" అన్నాడు. గ్రీన్ రూమంతా మైకుల తోటి, స్పీకర్లతోటి గజిబిజిగా ఉంది.

"పోన్లెండి. కాకతాళీయంగా వైస్ ప్రెసిడెంటు గారి ఆమోదం కూడా పొందాను" అంది కళ్యాణి.

"ఆయనా నాకు చెప్పలేదు. ఈ ప్రోగ్రామ్స్ అన్నీ కండక్ట్ చేయమని ఆయన డ్రామా డ్రెస్సింగ్ హాలులోకి వెళ్లారు" అన్నాడు సుబ్బరావ్ ఓ మైకు మీద చేయి వేస్తూ.

"మరయితే ఎలా ఎనౌన్సు చేస్తారు? ఒకవేళ నేను రావంటే" గుచ్చి గుచ్చి చూస్తూ అడిగింది కళ్యాణి, సుబ్బరావ్‌ని కనిపెడుతూ.

"చాల ఇన్‌సల్టుగా ఉంటుంది."

"ఎవరికి"

"నాకే"

"పోన్లెండి. ఆ పరువులాటి దేదో పోలేదుకదా ...!"

"లేదులెండి."

"ఇకనైనా భద్రంగా ఉంచుకోండి. డామేజీ జరక్కుండా...."

"కళ్యాణి! ...." — ఆ పిలుపు వెనక ఎన్నో మైళ్ల ఆవేదన ఉంది అనురాగపు అంబరం ఉంది. హెయిర్‌డ్రెస్ చేసుకుంటూ జడ ముందుకు వేసుకుని అల్లుకుంటూన్న కళ్యాణిని అద్దంలో చూస్తూ అన్నాడు సుబ్బరావ్.

నరము పూర్తి అమ్మకం
కాశ్మీరి శాల్వాలు
అందమైన రంగులలో, ఒకటి రు. 6 వంతున అమ్మబడును. ఒక ఎలెక్ట్రిక్ హీటర్ ఉచితంగా రెండు శాల్వాలు కొన్నవారికి యివ్వబడును. పోస్టేజి రు. 1-50 స్టాకు కొద్దిగా వుంది. నేడే ఆర్డరు చేయండి

ANGORA FABRICS (A.P.M)
Kirti Nagar, N Delhi-15.

యాలక్కాయ, లవంగము
తాంబూలములకు
యిప్పుడు అక్కరలేదు.
రూచి


సుగంధ ద్రవ్య సముదాయము
అన్ని కిరాణాకొట్లలో దొరకును.
కిళ్ళీకొట్లలో వాడబడుచున్నది.
నానాకాస్మటిక్సు, విజయవాడ-2.

గృహములో వాడదగు సినిమా
ప్రొజెక్టరుకు ఆర్డరు యివ్వండి


మీకుటుంబమునకు ఆనందదాయకమైన వినోద కాలక్షేపం, అద్భుతములు, సాహసములు నీఇంట్లోనే మా ప్రొజెక్టర్‌తో చూడవచ్చును టార్చితోగాని లేక ఏ.సి/డి.సి ఎలెక్ట్రిసిటీతో పని చేయించవచ్చును. 35 ఎం. ఎం.ఫిలింవాడవచ్చు. సినిమావలె చిత్రములు తమంతటతామే వివిధ రంగులలో కదలుచుండును. ఖరీదు రు 15/-; 40' ఫిలిం & 4'×3' స్క్రీను & ఇన్‌స్ట్రక్షన్ పుస్తకం ఉచితం. పోస్టేజిరు4-50 డీలక్స్‌స్పెషల్ రు25; 60' ఫిలిం, స్క్రీను & ఇన్‌స్ట్రక్షన్ పుస్తకము ఉచితం పూర్తితృప్తి లేనిచో డబ్బు వాపసు. కొద్దిస్టాకు వున్నది. నేడే ఆర్డరు పంపండి
HollywoodCinemaCorpn(Regd)
(WAM), 2194, alyanpura
Delhi -6

# ప్రేమ సితారా

"ఊఁ...." సితారాలా మ్రోగింది కలకంఠి.

ప్రేమగిటారు అనుకొన్నాడు అతను. తంత్రులు మీటబోయాడు.

ఆమె భుజంమీద సుబ్బరావ్ చెయ్యి ఆమె జవాబియ్యలేదు. ఆమె ఇంకా కేశాగ్రాల్ని అల్లుకుంటూనే ఉంది.

ఆమె అతని చెయ్యి విసిరికొట్టింది. సుబ్బరావ్ అదిరిపడ్డాడు.

"ఏయ్ మిస్టర్ రావ్ ! ఏమిటీ పిచ్చివేషాలు. ఇది గ్రీన్‌రూమ్ అనుకొన్నారా ? ప్రణయమందిరం అనుకున్నారా ? ఏదో సెక్రటరీకదా అని లోనికి రానిస్తే తాహతుకు మించినీ వాగుడు ఛీ .... ఛీ .... గెటవుట్ ...."

సుబ్బరావ్ రెండంగలలో బయటికి వచ్చేశాడు. వెళ్ళిపోతూవుంటే "మీ ఫైల్! మళ్లీ దీనికోసం తయారవుతారు" అంటూ ఫైలు అందించింది కళ్యాణి

సుబ్బరావ్‌లో రెండు అగ్నిపర్వతాలు ఒక్కసారిగా భళ్ళుమన్నాయి. జాయింటు సెక్రటరీకి పని అంతా అప్పచెప్పి హాస్టల్లో తన రూమ్‌కి వచ్చి పడుకున్నాడు.

గ్రీన్‌రూమ్ తలుపు దగ్గర పహరా ఇస్తున్న శేషావతారం లోపల జరిగిన రసాభాసకి తోక ముడిచాడు. ప్రక్క గదిలోంచి వీళ్ల ప్రణయఘట్టం టేప్ రికార్డు చేస్తున్న నరసింహం టేపు జేబులో పెట్టుకొని పలాయనం చిత్తగించాడు.

మిత్రులంతా నరసింహం అధ్యక్షతన జరిగిన రహస్య సంతాపసభలో టేప్‌రికార్డు చెప్పిన సంగతి విన్నారు. కిమ్మనకుండా మిగతా రోజులు దొర్లించడానికి నిశ్చయించుకొన్నారు. సుబ్బరావ్ ఇప్పుడు ఎవరితోటి కలివిడిగా తిరగటంలేదు. మునుపటి సినీమాలు, సర్దాలూ లేవు. హుషారైనా బాతాఖానీలూ, విందులూ పూర్తిగా లేవు. ఎవడి మానాన వాడు మెస్‌కి వెళ్లి భోంచేసి రావటమే జరుగుతోంది.

ఈ సంఘటన సుబ్బరావ్‌ని పుస్తకాల పురుగుగా మార్చివేసింది ఇప్పుడు పుస్తకం తప్ప మరొకటి ముట్టడు. టెన్నిస్‌కి కూడా వెళ్లటం లేదు. ఏకైక పుత్రుడు కావటంవల్ల డబ్బుకీ, గారాబానికీ ఇబ్బంది ఉండేదిలేదు. చదువుమీద అశ్రద్ధ మూలాన సగటు విద్యార్థిలా ఉండేవాడు. ఉన్న తెలివితేటలకి పరిశ్రమ కూడా తోడయిందేమో. సుబ్బరావ్‌కి ఫస్టు మార్కులు వచ్చేవి. శేషావతారంతోనైనా ఇదివరకంతటి చనువుగా మాట్లాడడు.

సంక్రాంతి సెలవ లయిన తర్వాత కాలేజి మళ్ళా తెరిచారు. సుబ్బరావ్ తన స్వంత వూరు వెళ్లి వచ్చాక కొంత తేరుకున్నాడు. కళ్యాణి హాస్టల్ లోనే ఉండిపోయింది. ఆమెకి కలకత్తాలో కన్నా ఇక్కడే బావుంది. స్నేహితులూ, కబుర్లూ. సుబ్బరావ్‌దీ ఆమెదీ కలకత్తాయే. అదే పరిచయంవల్ల ఇదివరకు ఒకరితో ఒకరు మాట్లాడుకొనేవారు. ఇప్పుడదీ లేదు.

* * *

సుబ్బరావ్ కథ వ్రాశాడన్న సంగతి కాలేజీ అంతా మారుమ్రోగి పోయింది. ఎప్పటికిలాగ టీపార్టీ అందుకుందామనే మిత్రులూ, వాళ్ళూ, అతని దగ్గరికి వెళ్లటానికి భయపడ్డారు కానీ,

"కంగ్రాచ్యులేషన్స్ సుబ్బరావ్ !" అనేసరికి,

సుబ్బరావ్ "ఏమిటీ ?" అన్నాడు నవ్వుతూ.

"భలే వ్రాశావ్‌లే! కళ్యాణి పొగరు ఈ దెబ్బతో హరీ మంటుంది. మళ్లీ హేమలతా, సరోజినీ, లీలావతి ఎవ్వరూ తలెత్తుకోలేరు. ఏమీ ఎరగనట్లు నటిస్తూ గట్టిపనే చేశావ్."

"అసలు .... నేనేమీ ...."

"వ్రాయలేదంటావ్ ! అంతేనా ? .... భలే వాడివే. చూడు పత్రిక"—శేషావతారం పత్రిక తీసి కథ చూపిస్తూ అన్నాడు. సుబ్బరావ్ నవ్వుతూ నిష్క్రమించాడు.

* * *

క్లాసులో ఉండగా ప్రిన్సిపాల్‌గారు రమ్మనమన్నా రంటూ కబురు వస్తే సుబ్బరావ్ ఆయన గదికి వెళ్ళాడు.

మిస్టర్ సుబ్బరావ్ ! నువ్వు చాలా పెద్ద మనిషి వనుకున్నాను. కాని ఇలాటి మేనర్‌లెస్ బ్రూట్‌వి అనుకోలేదు."

సుబ్బరావ్ ఏమీ టన్నట్లు చూశాడు.

"ఈమె ఎవరో తెలుసా !"

"......" సుబ్బరావ్ కళ్యాణి వైపు చూశాడు.

"హైకోర్టు జడ్జీగా రమ్మాయి. నీలాగే చదువుకోటానికి వచ్చింది."

"ఇంతకీ మీరనే దేమిటో చెప్పండిసార్ ...."

"ఉన్నత కుటుంబాలకి చెందినవాళ్ళని నీ యిష్టం వచ్చినట్లు రచ్చకీడ్వటం చాల సిగ్గుచేటు. నువ్వు ఈ కాలేజీ విద్యార్థివని అనుకోవటం కూడ అసహ్యంగా ఉంది.

"ఏమిటి మీరు మాట్లాడుతున్నది."

"ఈ పత్రికలో కథ వ్రాసింది నువ్వేనా !"

"నేనేం కథ వ్రాయలేదుసార్"

"దొంగ, దొంగతనం ఒప్పుకోవటం నే నెరగను. కళ్యాణి అని పేరుపెట్టి ఆమెని ఎందుకు పత్రికల్లోకి ఎక్కించావు. దీనిలోని సంఘటనలన్నీ ఈమెకి సరిపోయేటట్లు నీవు కాకపోతే మరెవరు వ్రాస్తారు — రచయితపేరు సుబ్బరావ్" అని ఉంది. నువ్వు సుబ్బరావ్‌వి కాదా ?"

"నేను వ్రాయలేదని మాత్రం చెప్పగలను. ఈ పరిస్థితుల్లో నేనేం చెప్పిన మీరు వినటం లేదు."

అసలు దేనికోసం చేశావు ఈపని. డబ్బు కోసమా. నీకు కప్పెట్టెనంత ఆస్థి ఉంది. పేరు

కోసమా ? అయినా మరొకర్ని, నీ స్వలాభం కోసం, రచ్చ కీడ్వటానికి హక్కు లేదు. ఆమెకి క్షమాపణ పత్రం వ్రాసి యివ్వు ......"

"నేను చేయని తప్పుకు శిక్ష అనుభవించాల్సిన అవసరం లేదు."

"మిస్టర్ సుబ్బరావ్ ! పర్యవసానం బాగుండదు అపాలజీ వ్రాసి యివ్వు."

ఏదెట్లా ఉన్నా నేను చేయని తప్పుకి శిక్షించమని ఏ శాస్త్రమూ చెప్పదు. అలా చేయటంలో నేను తప్పు చేసినట్లు అవుతుంది. మీ ఆజ్ఞ పాలించనన్నందుకు క్షమించండి" — సుబ్బరావ్ వెనక్కి తిరిగి వెళ్లిపోబోయాడు.

"అగు ! ఇంత చిన్న విషయానికి బ్రహ్మాస్త్రమ్ము ఉపయోగించ దలచుకోలేదు. నిన్ను కాలేజీనుంచి పంపించగలను. అయినా అలా చేయటం నాకిష్టం లేదు. నెలరోజులు పరీక్షలున్న ఈ సమయంలో ఏ కాలేజీలోనూ నిన్ను చేర్చుకోరు."

" ..........."— సుబ్బారావ్ మాట్లాడలేదు.

"కళ్యాణి, సాయంత్రంలోపున అపాలజీ యిస్తే పుచ్చుకో. రేపు నాకు చూపించు. ఇక మీ రిద్దరూ వెళ్లండి."

ఎవరో కథ వ్రాసి సుబ్బరావ్ పేరు పెట్టారనీ సుబ్బరావ్ క్షమాపణ వ్రాసియివ్వాలన్నారన్న వార్త కాలేజీ అంతటా పాక్కిపోయింది. క్షమాభిక్ష కోరుకుంటూ ఉత్తరం వ్రాసి మొహం చెల్లక వంట్లో బాగులేదన్న మిషమీద ఇంటికి వెళ్లిపోయాడన్న సంగతి హాస్టల్‌కి మాత్రం తెలిసింది.

*     *     *

"ఎపాలజీ ఇచ్చాడా !"—సుబ్బరావ్ వ్రాసి యిచ్చిన ఎపాలజీ చూసి కళ్యాణితో ఈమాటలు అని ప్రిన్సిపాల్ తమ ఫైల్‌లో ఖుర్ర దూర్చారు.

"వస్తామండి .... థ్యాంక్యూసార్' — కళ్యాణి, హేమ కలసి ప్రిన్సిపాల్ రూమ్ నుండి బయటపడి వెయిటింగ్‌రూమ్ చేరుకున్నారు. మిగతా ఫ్రెండ్స్ దగ్గర నవ్వాపుకోలేకపోయింది కళ్యాణి తను చేసిన ఘనకార్యానికి. హేమ మాత్రం చిరునవ్వు నవ్వుతూ దూరంగా నిలుచుంది.

"లేకపోతే మనకే వేదామనుకున్నాడు శేకరా..."

—మధ్య మధ్య నవ్వుల్లో కళ్యాణి మాటలు చెల్లాచెదరయ్యాయి.

"బలే అణిచావులే. పెద్ద ఫోజులరాయుడు...." లీలావతికి సుబ్బరావ్ అంటే అంత అయిష్టతే.

—ఈ మధ్య నమ్రత చూపిస్తున్నాడు. ఇది వరకు మగీనూ.

అసలు నేను పంపేటప్పుడు ఈ కథ అచ్చు వేసుకుంటా డనుకోలేదు. అనుమానపడతాడేమో నని భయపడ్డాను. చల్లగా వేసుకున్నాడు. మనం సెక్రటరీకి మెల్లగా బుద్ధిచెప్పాం." — కళ్యాణి సొంత డబ్బా తనే వాయించుకోవటం మొదలెట్టింది.

"అయితే .... ఆ ఎడిటర్ పంపించే పారితోషికం ఎవరికి వెళ్తాయి ?"

"పోనీవే, ఆ వెధవడబ్బు కెవడేడిశాడూ !"

అంతటితో ఆ ప్రస్తావన ఆగిపోయింది. బెల్ అయిన తర్వాత క్లాసులకి వెళ్లిపోయారు అంతా. ఏకాంత సమయంలో కళ్యాణి నడిగింది హేమ. "కళ్యాణి ! అతను నిజంగా బాధపడుతున్నాడేమో !"

"అబ్బ ఏమి లాలనే మాతల్లి .... అంత తల పొగరు ఆసామీకి బాధంటే డిఫినిషన్ తెలుసా ?"

"ఇలాటి విషయాలు సీరియస్‌గా తీసుకోవాలి కళ్యాణి. అపాలజీ కూడా నువ్వే ఫోర్జరీ చేయటం తప్పేమో !"

"తప్పా, ఒప్పా ఏమిటే పిచ్చిదానా ! అతను అపాలజీ తనది కాదంటూ ఉత్తరం ఏమీ వ్రాయడు. కథ నేను వ్రాసిందే అన్న రుజువు లేదు. అతని అడ్రస్సే పంపానుకదా పత్రికకి."

"తప్పు ఒప్పుల మధ్యన మానవత్వం బోధించే నగ్నసత్యం ఇదికాదు కళ్యాణి !"

"నగ్నసత్యం, నైలాన్ సత్యం ఇదికాదు ప్రపంచంలో కావలసినవి. ప్రపంచకం ఇది హేమా !— మోసం అంటే దగా అటే ప్రపంచం — మళ్లీ సైకిల్ పూర్తవుతుంది."

"అతను నిన్నుగురించి మరచిపోతున్నప్పుడు నువ్వు మానుతున్న కురుపుని రేపావు."

"ఛ ! పూరుకో ! సర్దాకోసం చేసినవాటిని సర్దాగానే చూడాలి మరీ అంత మైదా చేయకూడదు."

"నీసర్దా ఒకళ్ల ఖర్చుమీద, హానిమీదా కాదు పొందవలసింది."

"అబ్బ, అవుదూ !"

సుబ్బరావ్ పరీక్షలు మొదలెట్టిన రోజునే వచ్చాడు. ఆఖరు అయిన మర్నాడు వెళ్లిపోయాడు. మిగత స్నేహితులంతా రెండ్రోజులుండి వెళ్లమన్నారు. కాని సుబ్బారావ్ నవ్వుతూనే ఒప్పుకోలేదు. కళ్యాణికి ఇంటినుంచి తొందరగా రమ్మనమని టెలిగ్రాం అందటంతోటే ఆవేళ బయలుదేరింది.

వీడ్కోలు యివ్వటానికి లేడీస్ హాస్టల్ వాళ్లంతా స్టేషన్‌కి వెళ్లారు. హేమమాత్రం హుషారుగా ఉండకపోవటం చూసి అంది కళ్యాణి.

"హేమా ! ఇన్నాళ్లు కలసిఉన్నా నన్నర్థం చేసుకున్నది......."

"అట్లా అనకు కళ్యాణి! నువ్వెప్పుడూ కళ్యాణివే! నేనర్థం చేసుకున్నదీ అదే. అయితే ఇంత నిరాదరంగా ఉండే నిన్ను చూస్తే నీకు చెప్పలేని తీయని బాధ ఉండటం సంభవమేనా అనిపిస్తుంది."

హేమ చేతి గాజుల్ని సవరిస్తూ కళ్యాణి మాట్లాడలేదు.

"నాకు ఇప్పుడున్నంత హృదయభారం మరెప్పుడూ లేదు...." అంది హేమ.

*     *     *     *

సెలవుల్లో వచ్చిన రెండు శుభలేఖల్నీ చూసుకొని మిత్రులంతా తమ తమ ప్రదేశాలనుండి పెళ్లికి బయల్దేరారు జడ్జిగారి పూరికి. ★


పండిత
డి గోపాలాచార్యులవారి
బ్రాహ్మీ అమృతం
ఆరోగ్యానికి బలానికి
ఆయుర్వేదాశ్రమం
(ప్రైవేట్) లిమిటెడ్
మదరాసు-17

ఉచితము



మా బాల్ కళా తైలం నం. 555 క్రమంతప్పకుండ వాడితే మీతల వెంట్రుకలు నల్లబడి దట్టంగా పెరుగును. బట్టతలరానీయక మీ వెంట్రుకలను అందంగాను, నల్లగాను పెంచును. అది మెదడునకు, కండ్లకు చల్లదనం కలిగించును. ధర రు 2-50, పోస్టేజి రు 1-50. 3 బుడ్లు పూర్తికోర్సు రు 7 లు. ఈ నూనెను ప్యాక్తిపర చేందుకు అందం, మన్నిక కల ఒక బొమ్మగడియారం, ఒక గోల్డు గోల్డు ఉంగరం ఒకసీసాతోను, 3 సీసాలతో 4 వాచీలు, 4 ఉంగరములును ఉచితంగా ఇస్తాం. మీఅడ్రసు ఇంగ్లీష్‌లో విడిఅక్షరములలో వ్రాయండి :

SANYASI PHARMACY (A.P.W)
Faridabad (Near Delhi)




దొంగలనుండి, క్రూరమృగములనుండి మిమ్ము రక్షించుకోండి. వనభోజనములు, యాత్రలు, నాటకములకు చాల ఉపయోగమైనది. ఆటోమేటిక్ ఆరు తూటాలుగలది, తేలికైనది. దీని పెద్ద శబ్దము, ప్రకాశమైన మంట మిమ్ము ఆపదలనుండి రక్షించును.

| | | | | |
|---|---|---|---|---|
| ధర | నెం. | 333 | 444 | 555 |
| | రు. | 6 | 8 | 13 |

25తూటాలు ఉచితం: ఆపైన ప్రతి 100 తూటాలు రు. 3. లెదరుకేసు రు 4. పోస్టేజి రు.2. లైసెన్సు అనవసరం. ఒకే ప్యాకింగులో రెండు రివాల్వర్లు తెప్పించుకున్న పోస్టేజి, ప్యాకింగు ఉచితం.

BHARAT COMMERCIAL STORES
P.B. 63, (PAP) JULLUNDUR CITY.